సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 16 । నవంబర్ । 2023



రెండోరోజు గంగాహారతి

ధర్మపురి:కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గంగాహారతి ఘనంగా నిర్వహించారు.



‘దివ్య’మైన సౌకర్యాలు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభుత్వం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసింది.

10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

రాజన్నను దర్శించుకున్న రెవెన్యూ చీఫ్ సెక్రటరీ



కోడె మొక్కు చెల్లించుకుంటున్న నవీన్ మిట్టల్

వేములవాడఅర్బన్: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని బుధవారం రెవెన్యూ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్, అధికారులు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్ పవన్, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలల్లోని పరిసరాలు, రికార్డులు, కంప్యూటర్లను పరిశీలించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమాన్ని తప్పకుండా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పిల్లల అభ్యున్నతి కోసం పాటుపడాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలన్నారు. పదో తరగతిలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ కోఆర్డినేటర్ పద్మజ, మండల నోడల్ అధికారి కృష్ణహరి, ఎంఈవో సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు అనుప్రభ, దబ్బెడ హన్మండ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గడ్డం నర్సయ్య రాజీనామా

సిరిసిల్లటౌన్: రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా పత్రాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ఫ్యాక్స్ ద్వారా పంపించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు సమితి అధ్యక్షులకు గౌరవ వేతనం ఇస్తామని ఇవ్వలేదని, రైతుల గోసపై మంత్రి కేటీఆర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాలని చూస్తే.. వారు చొరవ చూపలేదన్నారు. నిధులు, విధులు లేని రైతుబంధు సమితి అధ్యక్ష పదవికి, బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆలయ కౌలుభూమికి టెండర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవసాయ భూమిలో కౌలుసాగుకు టెండర్ ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ శివారులోని సర్వేనంబర్ 263, 264లో గల 2.03 ఎకరాల్లో సాగు చేసేందుకు ఏడాది కోసం టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.2వేల ధరావతు చెల్లించి ఈనెల 25 ఉదయం 11.30 గంటలకు ఆలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

బరిలో 216 మంది



- నామినేషన్ ఉపసంహరించుకున్న 57 మంది అభ్యర్థులు
- స్వతంత్రులు, చిన్న పార్టీలకు గుర్తుల కేటాయింపు
- తప్పుకున్న ఉమ, కటకం, నల్ల, నాగి
- చాలాచోట్ల త్రిముఖ పోటీ!

నియోజకవర్గాల వారీగా సమాచారం

నియోజకవర్గం	బరిలో	విత్‌డ్రా
కరీంనగర్	27	04
హుజూరాబాద్	22	11
చొప్పదండి	14	03
మానకొండూరు	10	03
సిరిసిల్ల	21	02
వేములవాడ	16	04
పెద్దపల్లి	17	08
మంథని	21	03
రామగుండం	23	03
జగిత్యాల	15	04
కోరుట్ల	15	05
ధర్మపురి	15	03
మొత్తం	216	57

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల స్క్రూటినీ పూర్తయింది. 12 నియోజకవర్గాల్లో మొత్తం 216 మంది పోటీలో ఉండగా.. 57 మంది తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. జాతీయ, స్థానిక పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు ఈసారి బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ లాంటి పార్టీల నుంచి బరిలో ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం మూడు పార్టీలు బరిలో ఉన్నాయి. గతంలో బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఈసారి మాత్రం దాదాపు అన్నిచోట్ల బలమైన కేండిడేట్లు ఉన్నారు. మూడు బలమైన పార్టీలు ఉండటంతో త్రిముఖ పోరు తప్పేలా లేదు. మరోవైపు ఆర్వోలు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు డ్రా సిస్టమ్ ద్వారా గుర్తులను కేటాయించారు. దీంతో స్వతంత్రులందరూ తమకు కేటాయించిన గుర్తుతో ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలన్నీ అగ్రనేతలతో భారీ బహిరంగ సభలకు, కార్నర్ మీటింగులకు ఇప్పటికే అనుమతులు తీసుకున్నాయి.

తప్పుకున్న వారిలో బంధువులే అధికం

నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో అధికంగా ప్రధాన పార్టీలకు చెందిన డమ్మీ కేండిడేట్లు, అక్కడక్కడా అసంతృప్తులు ఉండటం గమనార్హం. స్వచ్ఛందంగా తప్పుకున్న వారిలో మంత్రి కమలాకర్ సతీమణి గంగుల రజిత, ఆది శ్రీనివాస్ భార్య వనజ ఉన్నారు. ఇక బీఫాం ఇవ్వకపోవడంతో తిరస్కరణకు గురైన వారిలో మంథని నుంచి పుట్ట మధు సతీమణి శైలజ, చల్లా నారాయణ రెడ్డి సతీమణి సుజాత, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి కోడలు మమతారెడ్డి, కరీంనగర్ నుంచి పురమళ్ల శ్రీను సతీమణి లలిత, మానకొండూరులో కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, కోరుట్లలో కె.సంజయ్ తండ్రి విద్యాసాగర్‌రావు ఉన్నారు. చొప్పదండిలో కాంగ్రెస్ రెబల్ నాగి శేఖర్, పెద్దపల్లి బీఆర్‌ఎస్ రెబెల్ నల్ల మనోహర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారు. సిరిసిల్ల నుంచి స్వతంత్ర అభ్యర్థి కటకం మృత్యుంజయం, వేములవాడ నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ తుల ఉమ పోటీ నుంచి వైదొలిగారు.

ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు వచ్చే అవకాశాలున్నాయి. సాధారణంగా ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 గుర్తులు (నోటాతో కలిపి) కేటాయించే వీలుంది. ఒకవేళ అభ్యర్థులు 15 మంది దాటితే.. రెండో ఈవీఎం వినియోగం అనివార్యమవుతుంది. చొప్పదండి, మానకొండూరు, జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో సింగిల్ ఈవీఎం వినియోగించనున్నారు. ఇందులో చొప్పదండి, మానకొండూరు, ధర్మపురి ఎస్సీ నియోజకవర్గాలు. ఇక మిగిలిన కరీంనగర్, హుజూరాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 15 మందికి మించి ఉండటంతో ఇక్కడ రెండో ఈవీఎం తప్పనిసరి.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్

- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ
- అన్ని పార్టీలూ సహకరించాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్

సిరిసిల్ల: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం అఖిల పక్ష నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల లోగా ప్రచారం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఫేక్ న్యూస్‌లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టొద్దన్నారు. అలాంటి పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత ప్రశాంత పారదర్శక వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేములవాడ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములను ఏబీసీడీ కేటగిరీలుగా విభజించామని వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్వోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అఖిల పక్ష నాయకుల పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరిగేలా చూడాలి

బోయినపల్లి(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎన్నికల పరిశీలకులు (జనరల్) డాక్టర్ సీఆర్ ప్రసన్న అన్నారు. బుధవారం బోయినపల్లి మండలం తడగొండ, బోయినపల్లి, కోరెం, బూర్గుపల్లి, మల్కాపూర్ తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మౌలిక వసతులు పరిశీలించారు. గతేడాది పోలింగ్ సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్‌శాతం పెరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.



తడగొండ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రసన్న

నిర్వాసితుల కోసం పోరాడిన



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



పల్లిమక్తలో ప్రచారం నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

- ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: ముంపు గ్రామాల సమస్యలు తెలిసిన వాడిని, తాను మీ వెంట ఉంటూ పోరాటం కూడ చేసిన వాడిని, మీకు అందుబాటులో ఉన్న బిడ్డను.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మీ సమస్యలు పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ మండలం ఆరెపల్లి, సంకెపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ముంపు గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఇందిరమ్మ పథకం కింద రూ. 5 లక్షల అందిస్తామన్నారు. చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, సర్పంచులు రాజుకుమార్, ప్రదీప్, శ్రీనివాసరావు, పర్శరాములు, లింగయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లో ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు.

ప్రజలను నమ్ముకుంటున్న

కోనరావుపేట: పట్టణాల్లో స్థిరపడ్డ వారు డబ్బు సంచులను నమ్ముకుంటే, తాను ఎల్లవేళలా ప్రజలతోనే ఉంటూ వారినే నమ్ముకున్నానని ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పల్లిమక్తలో మాట్లాడుతూ ఇన్నాళ్లు ప్రజలకు దూరంగా ఉన్న వ్యక్తులు ఎన్నికలు రాగానే డబ్బు సంచులతో తిరుగుతున్నారని అన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా ఎల్లవేళలా ప్రజల మధ్యే ఉన్నానన్నారు. అబద్దాల హామీలతో గెలిచిన ఎమ్మెల్యే పరాయి దేశంలో ఉండి పాలన సాగించారని తెలిపారు. బీఆర్‌ఎస్‌తో ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు ఎల్లయ్య, ప్రభాకర్ రెడ్డి, రవి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటింగ్‌కు మైక్రో అబ్జర్వర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- జిల్లాలో 14 బృందాలు
- క్షేత్రస్థాయిలో 21 నుంచి 25వ తేదీ వరకు ఓటింగ్
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఆమోదించారని, వారి వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు, పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలియజేస్తామని అన్నారు. ఇంటి నుంచి ఓటింగ్ నిర్వహణకు మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నామని వెల్లడించారు. ఒక్క పోలీస్ అధికారితో పాటు, పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి ఓటింగ్ ఈనెల 21వ తేదీ నుంచి నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన నిర్వహించే ఎన్నికలను రహస్య విధానంలోనే ఓటు వేస్తారని తెలిపారు. ఇప్పటికే బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారా వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు సమాచారం అందించామని అన్నారు. వారు ఆయా గ్రామాలను ఏ రోజున సందర్శిస్తారనేది షెడ్యూల్ వివరంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఇంటిలో ఉండి వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ ఏజెంట్లని అనుమతిస్తామని, వీడియోగ్రఫీ చేస్తామన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఇప్పటికే రెండు కంపెనీల బీఎస్‌ఎఫ్ బలగాలు జిల్లాకు వచ్చాయని, మరో నాలుగు కంపెనీ బలగాలు వస్తాయని వివరించారు. ఒక్కో మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమించామని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపాఉ. ఈ సమావేశంలో డీపీఆర్వో ఎం.దశరథం పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

వేములవాడఅర్బన్: శారీరక మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి సంస్కృత విద్యాసంస్థలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగా విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచుతూ మానసిక ఒత్తిళ్లను దూరం చేస్తుందన్నారు. సంస్కృత విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆవుల మల్లారెడ్డి, యోగా గురువు ఎలిగెటి కృష్ణ, సీహెచ్.శ్రీనివాస్, తిరుపతి, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్

ముఖం చూసి ఓటేస్తే ఆగమైతం

- జిల్లాలో కేటీఆర్ సుడిగాలి పర్యటన
- పలు మండలాల్లో రోడ్‌షో.. కార్నర్ మీటింగ్‌లు
- బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

వేములవాడ అర్బన్/వేములవాడరూరల్/చందుర్తి/కథలాపూర్/కోనారావుపేట/రుద్రంగి/తంగళ్లపల్లి: మనూరి వ్యక్తి, మనతో ఉన్నడని ముఖం చూసి ఓటేస్తే ఆగమైతమని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. జిల్లాలోని వేములవాడ, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలు, రోడ్‌షోలకు హాజరయ్యారు. వేములవాడలో మంత్రి మాట్లాడు తూ హనుమంతుడి గుడి లేని ఊరు లేదు.. కేసీఆర్ సంక్షేమం అందని ఇల్లు లేదు. అభివృద్ధి మీ కళ్ల ము ందు కనిపిస్తుందని అన్నారు. రాజన్న గుడి, వేములవాడ అభివృద్ధి ప్రభుత్వ బాధ్యతన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అసమర్థ పాలనతోనే తెలంగాణ ప్రాంతం వెనుకబడిందన్నారు. ఈ ఎన్నికలు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థికి జరుగుతున్నవి కాదని, తెలంగాణ ప్రజలకు, ఢిల్లీ దొరలకు మధ్య జరిగేవన్నారు. రెండేళ్ల కరోనా ప్రభావం పోగా మిగిలిన ఆరున్నరేళ్లలో ఎనలేని అభివృద్ధి సాధించామని.. ఇంకా సాధించాల్సింది చాలా ఉందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కోతలు తప్పవన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే 18 ఏళ్లు నిండిన యువతులకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతినెలా రూ.3 వేలు ఇస్తామన్నారు. తాను చెప్పేవి అబద్ధాలైతే ఓటు వేయవద్దని, నిజమైతేనే కారుగుర్తుకు ఓటువేయాలని కోరారు.

ఆరున్నరేళ్లే పాలించాం..

దరిద్రపు కాంగ్రెస్‌ను నెత్తిన పెట్టుకుంటే మళ్లీ రాష్ట్ర ప్రజల బతుకులు ఆగమైపోతాయని మంత్రి కేటీఆర్ అన్నారు. కరెంట్ లేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతూ, మోటారు కాలుతూ, పంటలు ఎండిపోతూ ఉంటే.. పెట్టుబడులు చేతికి అందక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ పాలనతో అవి పునరావృతం చేసుకుందామంటే ఆ పార్టీ ఓటు వేయాలన్నారు. ఎప్పుడు ఉంటాడో, మళ్లీ ఎప్పుడు జైలుకు వెళ్తాడో తెలియని రేవంత్‌రెడ్డి చేతిలో అధికారం పెడితే రాష్ట్రం అంధకారమేనని విమర్శించారు. తెలంగాణ తెచ్చుకున్నది మనం పాలించుకోవడానికేనని, మళ్లీ ఢిల్లీవాళ్లకు అప్పగించడానికి కాదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు 50 వేల మంది బీడీ కార్మికులకు కొత్తగా జీవనభృతి అందిస్తామని హామీ ఇచ్చారు.



రోడ్డు షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వేములవాడను దత్తత తీసుకుంటా

చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపిస్తే వేములవాడను దత్తత తీసుకుంటానని, అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని కేటీఆర్ అన్నారు. కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలా లకు సాగునీరందించే సూరమ్మ ప్రాజెక్టును పూర్తిచేస్తామని తెలిపారు. రాళ్లవాగు ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ, తక్కళ్లపెల్లి వంతెన పనులు పూర్తిచేయిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌లో ఆడబిడ్డలను గౌరవిస్తామని, తుల ఉమక్కకు ఉన్నత పదవి స్తామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులు, ప్రజలకు మళ్లీ కాళరాత్రులు తప్పవని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు రాత్రిపూట కరెంట్ పెట్టడానికి వెళ్లి ప్రతిరోజూ శివరాత్రి జాగారం చేసేవారని, తెలంగాణ వచ్చాక ఆ బాధలు తప్పాయన్నారు.

సిరిసిల్లకు త్వరలోనే రైలు కూత



వేములవాడలో హాజరైన జనం

సిరిసిల్ల జిల్లా ప్రజల చిరకాల వాంఛ రైలు కల త్వరలోనే నెరవేరబోతుందని, సిద్దిపేట వరకు వచ్చిన రైలు కూత త్వరలో సిరిసిల్లలో వినబడనుందని మంత్రి కేటీఆర్ అన్నారు. నేను మీ ఇంటి బిడ్డను, మీ ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేను, మంత్రిని అయ్యాయనని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గాన్ని దేశంలోనే నం.1 గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

రూ.75 లక్షలతో బడి కట్టించిన..

బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఎక్కడినుంచో వచ్చిన వారికి ఓటు వేయొద్దని, ఊరువాడిని తనకే ఓటు వేయాలని కోరుతున్నానని, తన ఊరికి ఆయన ఏం చేశారో ప్రశ్నించాలన్నారు. తన ఊరిలో రూ.75 లక్షలు వెచ్చించి బడి కట్టించిన, ఓటు వేయాలని అడుగుతున్నానన్నారు.

క్లుప్తంగా

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: పోలీస్ అధికారిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2013 జూలై 28న సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లో తబ్లిక్ జమాత్, సున్నీ జమాత్‌కు చెందిన ముస్లింలు రెండుగా విడిపోయి గొడవ చేసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న అప్పటి సీఐ ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి ఆపేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన మహ్మద్ తాజ్ సీఐపైకి రాయి విసరడంతో చేతికి గాయమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దాడికి కారణమైన తాజ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పును వెల్లడిస్తూ మహ్మద్ తాజ్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. శాంతిభద్రతల రక్షణలో అనునిత్యం పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బందిపై దాడులకు దిగిన, విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది..

సిరిసిల్లక్రైం: ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2023 జూన్ 29న రగుడు ఎల్లమ్మ ఆలయం, సిరిసిల్ల విశ్వనాథ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీ చేశారని ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి మైలారం ఆశా రాములు, బాల నర్సింహులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి బీసీ నాయక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ఎస్సై లావుడ్య శ్రీకాంత్, కానిస్టేబుల్ నరేశ్‌లు సాక్ష్యాలు ప్రవేశపెట్టడంతో పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ఆశా రాములు, నర్సింహులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హార్వెస్టర్‌కు నిప్పు

పాలకుర్తి(రామగుండం):పుట్నూర్ గ్రామంలోని రైతు నార సత్తయ్యకు చెందిన హార్వెస్టర్‌ను దుండగులు దహనం చేశారు. సత్తయ్య గ్రామశివారులోని తన పొలంలో మంగళవారం రాత్రి వరకూ వరికోశాడు. యంత్రాన్ని పొలంలోనే ఉంచి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా హార్వెస్టర్ ముందుభాగం పూర్తిగా కాలిపోయి ఉంది. రాత్రివేళ దుండగులు ఈదుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈవిషయంపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈఘటనలో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన భార్గవ్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి వైపు వెళ్తుండగా.. పెద్దపల్లి వైపు నుంచి ప్లాంట్‌కు వస్తున్న లారీ క్రాసింగ్ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో భార్గవ్ కాలుకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం ఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

ఉనికి కోల్పోయిన కామ్రేడ్స్

- కమ్యూనిస్టులకు ఉమ్మడి జిల్లా ఆయువుపట్టు
- 'అనభేరి, బద్దం' వంటి మహామహుల పురిటి గడ్డ
- 1952 నుంచి పలువురు చట్టసభలకు..
- సాయుధ పోరాటం, ప్రజల పక్షాన గొంతు వినిపించిన చరిత్ర
- నేడు అర్థబలం, అంగబలం లేక చతికిల పడిన వైనం
- తొలిసారి ఇక్కడి నుంచి పోటీకి దూరం


వెంకట్‌రెడ్డి


రాజేశ్వర్‌రావు (ఫైల్)


అనభేరి (ఫైల్)


ఎల్లారెడ్డి (ఫైల్)


చిన్నమల్లయ్య (ఫైల్)


సీపీఐ శ్రేణుల ర్యాలీ (ఫైల్)

కరీంనగర్: నిజాం నిరంకుశ, రాచరిక పాలన, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసిన చరిత్ర సీపీఐది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఆ పార్టీని ఎంతగానో ఆదరించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల నుంచి పలుమార్లు ఎర్రజెండాను చట్టసభలకు పంపారు. ఆ నేతలు కూడా ప్రజల పక్షాన తమ గొంతు వినిపించారు. ఉమ్మడి జిల్లా మొదటి నుంచి కమ్యూనిస్టులకు ఆయువుపట్టుగా నిలిచింది. నిజాం నవాబు రాచరిక పాలన అంతం కోసం పోరాడి, తొలి ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్‌రావు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని బద్దం ఎల్లారెడ్డిలతోపాటు ఎందరో అగ్రగణ్యులను అందించిన కరీంనగర్ వామపక్ష పోరాటాలకు పుట్టినిల్లయింది. అనభేరి ప్రభాకర్‌రావు సీపీఐ జిల్లా తొలి కార్యదర్శి కావడం గమనార్హం. అమృతలాల్ శుక్లా, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, దేశిని చిన్నమల్లయ్యలు జిల్లా కార్యదర్శులుగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సారథ్యం వహించి, ప్రస్తుతం జాతీయ నాయకుడిగా ఉన్న చాడ వెంకట్‌రెడ్డి సైతం జిల్లాకు చెందినవారే. అలాగే, 1952లో కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఓడించిన బద్దం ఎల్లారెడ్డి సీపీఐ నాయకుడే.

ఏడు నియోజకవర్గాల్లో గెలుపు..

తొలినాళ్లలో కరీంనగర్‌తోపాటు అప్పటి నుస్తులాపూర్, ఇందుర్తి, బుగ్గారం, చొప్పదండి, మేడారం, నేరెళ్ల అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ, పీడీఎఫ్ అభ్యర్థులుగా చీటి వెంకటరామారావు, బద్దం ఎల్లారెడ్డి, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, బి.మల్లారెడ్డి, అమృతలాల్‌శుక్లా, దేశిని చిన్నమల్లయ్యలు విజయం సాధించారు. అలాగే, ఉమ్మడి శాసనసభలో చెన్నమనేని రాజేశ్వర్‌రావు, చాడ వెంకట్‌రెడ్డిలు సీపీఐ శాసనసభాపక్ష నేతలుగా వ్యవహరించారు. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరగగా, ఇందుర్తిలో 8 సార్లు, సిరిసిల్లలో 6 సార్లు సీపీఐ అభ్యర్థులు గెలవడం గమనార్హం. అలాగే, 1952 నుంచి రెండు దశాబ్దాలపాటు కమ్యూనిస్టులు అసెంబ్లీతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడక్కడ విజయం సాధిస్తూ గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉండేవారు.

2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే లేరు

జిల్లాలో ఘన చరిత్ర గల సీపీఐ మారుతున్న సమీకరణాలను ఆకళింపు చేసుకోలేక ప్రజలకు దూరమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థి కూడా లేకపోవడం ఆ పార్టీ ఎంత బలహీనంగా ఉందో చెబుతోంది. సిరిసిల్ల, ఇందుర్తి ఏరియాల్లో ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతో ఇంతో పట్టు సాధిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో యువతను పార్టీలోకి ఆకర్షించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. దీనికితోడు 1994 నుంచి జరుగుతున్న అంతర్గత పోరు పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక్క హుస్నాబాద్ నియోజకవర్గంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో క్యాడర్ ఉంది. ఈసారి ఎన్నికల్లో సీట్ల ఒప్పందంలో భాగంగా దాన్ని కాంగ్రెస్‌కు కేటాయించడంతో కార్యకర్తలు నిరాశకు లోనయ్యారు. 2018 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన చాడ వెంకట్‌రెడ్డికి 48 వేల ఓట్లు వచ్చాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోవడం, ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్నికల్లో తలపడే అర్థబలం, అంగబలం లేక ఉనికి కోల్పోయామని కామ్రేడ్స్ అంగీకరిస్తున్నారు. దీంతో గతమెంతో ఘనమని చెప్పుకుంటూ తృప్తి చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పదేళ్లలో కార్మికులకు చేసిందేమి లేదు


మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: పదేళ్ల కాలంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, అనుబంధ రంగాల కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేత కార్మికులకు అవి చేశాం.. ఇవి చేశామని ఊకదంపుడు ఉపన్యాసాలు మంత్రి కేటీఆర్ చేస్తున్నారన్నారు. నిజానికి బతుకమ్మ చీరల ద్వారా తన అనుచరులు, కొంతమందికే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ జరిపేందుకు నవంబర్ 17న అంబాభవానీ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, కూరపాటి రమేశ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ వాహనం తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీసులు

రుద్రంగి(వేములవాడ): ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రుద్రంగి మండల కేంద్రానికి వస్తున్న మంత్రి కేటీఆర్ వాహనాన్ని పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి కేటీఆర్ చిరునవ్వుతో తనిఖీలకు సహకరించి నిబంధనలు ఎవరికైనా వర్తిస్తాయన్నారు.


రేవంత్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రేవంత్‌రెడ్డి వాహనం తనిఖీ

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ చెక్‌పోస్టు వద్ద బుధవారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న రేవంత్‌రెడ్డి వాహనాన్ని ఆపి అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు లారీ ఢీ.. తప్పిన ప్రమాదం

ముత్తారం:కాసార్లగడ్డ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓడెడ్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఓడెడ్‌కు వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొనడంతో బస్సు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాసార్లగడ్డ – అడవిశ్రీరాంపూర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, మంథని–ఓడెడ్ ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఇరుకుగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డును ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ

ఆనందం.. అంతలోనే విషాదం

- బయల్దేరిన ఐదు నిమిషాల్లోనే..
- కారు బోల్తాపడి ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- కూతురును కళాశాలలో దింపేందుకు వెళ్తుండగా ఘటన
- హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం


మహేశ్ మృతదేహం


భాస్కర్ మృతదేహం

జగిత్యాల క్రైం: కూతురును కళాశాలలో దింపేందుకు ఓ వ్యక్తి తన బంధువులతో కలిసి కారులో ఆనందంగా బయల్దేరాడు.. కానీ, ఐదు నిమిషాల్లోనే ఆ వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం నెలకొంది. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామానికి చెందిన దేవరకొండ భాస్కర్(35) బుధవారం ఉదయం తన అత్తగారి గ్రామమైన హబ్సీపూర్‌కు కారులో వచ్చాడు. తన పెద్ద కూతురు అక్షరను కరీంనగర్‌లోని కళాశాలలో దింపేందుకు మామ, హబ్సీపూర్‌కు చెందిన ఇమ్మడి నందయ్య, బావమరిది శ్రీకాంత్, నందయ్య తమ్ముడి కొడుకు మహేశ్‌లతో కలిసి కారులో బయల్దేరాడు. కానీ, దురదృష్టవశాత్తు అది పొలాస శివారులో జగిత్యాల –ధర్మపురి ప్రధాన రహదారిపై అదుపుతప్పి, బోల్తా పడింది. ఈ ఘటనలో భాస్కర్, మహేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. నందయ్య, అక్షర, కారు నడుపుతున్న శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సదాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు భాస్కర్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, భాస్కర్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, మహేశ్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో దేవరకొండ భాస్కర్, ఇమ్మడి మహేశ్‌లు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి

రామగుండం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ లీగ్ పోటీలను అంతర్గాం మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఎనిమిది మండలాల నుంచి జట్లు హాజరయ్యాయి. అంతర్గాం వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి పోటీలు ప్రారంభించారు. తొలిరోజు గోదావరిఖని–యైటింక్లయిన్‌కాలనీ, అంతర్గాం–కరీంనగర్, గోదావరిఖని–హుజూరాబాద్ జట్లు తలపడ్డాయి. గురువారం పోటీలు ముగుస్తాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతినిధులు డబ్ల్యూ.గణపతి, కోల సంతోష్‌గౌడ్, వెంకట్రావు, వెంకటేశ్, నరేశ్‌కుమార్, అంగోతు శ్రీనివాస్, ప్రవీణ్, రాము, శివకుమార్, శ్రీనివాస్, గాంధీ, ఇ.రవికుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఊసేలేని మేనిఫెస్టోలు


మాట్లాడుతున్న నందు

రామగుండం: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే వివిధ రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రైవేట్ ఉపాధ్యాయుల ఊసేలేకపోవడం బాధాకరమని, తమ సంక్షేమానికి ప్రత్యేక మేనిఫెస్టో అవసరమని ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ నందు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కోవిడ్ మహమ్మారి నుంచి పరిస్థితి మరీ దారుణంగా తయారైందని ఆవేదన చెందారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రచారంతోపాటు మేనిఫెస్టోల్లో తమ సమస్యలు పొందుపరిచి పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కస్నూరి లక్ష్మణ్‌రావు, ప్రతినిధులు సంతోషి, సమీనా, రజని, నారాయణరావు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

బైండోవర్ అంటే..

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సమయంలో పోలీసుల నోట తరచూ వినిపించే పదం ‘బైండోవర్’. చాలామంది ఓటర్లకు బైండోవర్ అంటే ఏమిటో తెలియదు. బైండోవర్ అంటే బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు పాతనేరస్తులను అదుపులోకి తీసుకుంటారు. రౌడీషీటర్లు, సారా తయారీదారులు, అమ్మకదారులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు, ఇతర కేసుల్లోని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. అనంతరం వారిని తహసీల్దార్, ఆర్డీవోల ఎదుట హాజరుపరుస్తారు. సీఆర్‌పీసీ – 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ చేసి.. ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తారు. వీరు తహసీల్దార్ వద్ద బాండ్ పేపర్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలి. కొంత మొత్తం నగదు లేదా స్థిరాస్తి ష్యూరిటీ చూపించాలి. బైండోవరైన వ్యక్తులు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ష్యూరిటీ పెట్టిన సొమ్ము నుంచి వసూలు చేస్తారు. వీరు ఎన్నికల వేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమ అధీనంలోనే ఉంచుకుంటారు.

‘దివ్య’మైన సౌకర్యాలు

- జిల్లాలో 10,201 మంది దివ్యాంగులు
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక వసతులు
- ఇప్పటికే ర్యాంపులు, వీల్‌ఛైర్లు సిద్ధం


ముస్తాబాద్‌లో పోలింగ్ కేంద్రం వద్ద నిర్మించిన ర్యాంపు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ప్రతినిధిగా ఎన్నుకునే గొప్ప అవకాశం ఓటు ద్వారా రాజ్యాంగం కల్పించింది. ఈ నేపథ్యంలో దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసింది. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు కూడా కేంద్రంలోకి వెళ్లి ఓటు వినియోగించుకునేలా అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతోపాటు, మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని బోయినపల్లి మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు నిర్మించారు. నడవలేని వారి కోసం వీల్‌చైర్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 10,201 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరందరూ తమ ఓటును వినియోగించుకునేలా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు.

80ఏళ్లు పైబడ్డ వారికి ఇంటి వద్దే ఓటు

ఈసారి ఎన్నికల సంఘం 80 ఏళ్లు పైబడ్డ వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటును ఇంటి వద్ద వినియోగించుకునేలా ఫారం–12 డీ స్వీకరిస్తోంది. ఇప్పటికే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో అధికారులు పది బృందాలను ఏర్పాటు చేశారు. ఇందు కోసం వారికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోల ద్వారా ఇంటి వద్ద ఓటు వినియోగించుకునే వారి దరఖాస్తులను తీసుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు 910 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఈనెల 21 నుంచి 28 వరకు మండలాలు, గ్రామాల వారీగా ప్రత్యేక బృందాలు 80 ఏళ్ల వృద్ధులతోపాటు దివ్యాంగుల నుంచి దరఖాస్తులు తీసుకోనున్నారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ గుర్తింపు అనగా సదరం శిబిరాల్లో సర్టిఫికెట్లు పొందిన దివ్యాంగులకు మాత్రమే ఫారం–12 డీ అందజేస్తారు. ఓటింగ్ శాతం పెరిగేలా ఎన్నికల సంఘం ఈ చర్యలను చేపట్టడంతోపాటు వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఎన్నికలు ఈనెల 30న జరగనుండగా, వృద్ధులు, దివ్యాంగులకు ఈనెల 29న పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు.

మంచి అవకాశం



దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు సౌకర్యాలు కల్పించడం మంచిదే. ర్యాంపులు, కుర్చీలు ఇస్తామంటున్నరు. ఈసారి ఇంటికాడనే ఓట్లు వేసుకోవచ్చని చెప్పారు. దివ్యాంగులను గుర్తించి ఇబ్బందులు లేకుండా చేసిన అధికారులకు ధన్యవాదాలు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– జమాల్‌పూర్ రాజయ్య, దివ్యాంగుడు, ముస్తాబాద్

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం



80 ఏళ్లు పైబడ్డ వృద్ధులతోపాటు, దివ్యాంగులు ఇంటి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఫారం–12డీ ద్వారా ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయి. అలాగే స్పెషల్ డ్రైవ్‌తో పోస్టల్ ఓట్లు వేసేవారి పేర్లను నమోదు చేస్తున్నాం.

– జయంత్‌కుమార్, నాయబ్ తహసీల్దార్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

OLD AGE HOME

■ హరే కృష్ణ హోంకేర్, వంట/ఇంటి పనిచేయుటకు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును, హైదరాబాద్. Ph: 9640358899/ 9640158899 [H-793651]

WANTED

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221912]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824